క్లుప్తంగా

నేడు మరిడిమాంబ పరస

మల్కాపురం: మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి జాతర (కాకి అప్పన్న)తిరునాళ్ల మహోత్సవం సోమవారం జరగనుంది.ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. 60 ఏళ్ల నుంచి మల్కాపురం గ్రామస్తులంతా ఐక్యతతో మహోత్సవాలను నిర్వహించుకుంటున్నారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా మల్కాపురం పోలీసులు తగు భద్రత చర్యలు తీసుకుంటున్నారు.

మల్కాపురం సీఐ బాధ్యతల స్వీకరణ


సన్యాసినాయుడు

మల్కాపురం: మల్కాపురం శాంతి భద్రతల విభాగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా సన్యాసినాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా కొనసాగిన జి.డి.బాబు సాలూరు స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సన్యాసినాయుడు వచ్చారు. సీఐగా బాధ్యతలు తీసుకున్న సన్యాసినాయుడిని స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్,లా అండ్ ఆర్డర్,క్రైం విభాగాలకు చెందిన ఎస్‌ఐలు,ఇతర సిబ్బంది అభినందించారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు కృషి చేస్తానని సీఐ ఈ సందర్భంగా వివరించారు.

విధుల్లో చేరిన ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

గోపాలపట్నం: వెస్ట్ సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐగా గుగ్గిలాపు శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం గోపాలపట్నం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1998 బ్యాచ్‌లో ఎస్‌ఐగా సెలక్ట్ అయ్యారు. విశాఖ రూరల్‌లో ఎక్కువ కాలం పని చేశారు. శ్రీకాకుళంలో సీఐగా పని చేస్తూ విశాఖలో వీఆర్ నుంచి గోపాలపట్నం సీఐగా బదిలీ అయ్యారు. ట్రాఫిక్ విభాగంలో పని చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సజావుగా సాగే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

బీసీలకు న్యాయం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వాకింగ్ పార్కు సమీపంలో ఆదివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో బీసీలకు సమన్యాయం జరిగిందన్నారు.58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: ఆర్‌ఆర్‌వీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నరసింహనగర్, శ్రీరామ్‌నగర్ ఫీడర్లలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాపూజీనగర్, టైలర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చురుగ్గా కులగణన


శ్రీరామ్‌నగర్‌లో సర్వే చేస్తున్న సచివాలయ కార్యదర్శి, వలంటీర్లు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో కులగణన చురుగ్గా సాగుతోంది. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిస్తే మరింత వేగంగా పూర్తి చేయగలుగుతామంటున్నారు. ఆదివారం కావడంతో ఇళ్లల్లో అందరూ అందుబాటులో ఉంటారని ఉదయం నుంచి ఈ సర్వే చేపట్టారు.

ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కేలా..

- రూ.28 కోట్లతో ఎన్‌ఏడీ వద్ద మరో వంతెన
- శరవేగంగా ఆర్‌వోబీ నిర్మాణం
- ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుసంధానం


ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుసంధానం ఇక్కడే..


రైల్వేలైన్‌పై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

విశాఖ విద్య: జాతీయ రహదారిపై ఎన్‌ఏడీ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ)నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా రూ.28 కోట్లతో చేపట్టిన ఆర్‌వోబీని త్వరితగతిన పూర్తి చేసేలా వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఇదీ పరిస్థితి

ఎన్‌ఏడీ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలోనే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై కూడా మరో వంతెన నిర్మించాల్సిన అవసరాన్ని ఈ ప్రాంత వాసులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీఎంఆర్‌డీఏ ద్వారా ఈ పనులు చేపడుతున్నారు. విమానాశ్రయంతో పాటు గాజువాక నుంచి నగరంలోకి ఇదే మార్గంలో వాహనాలు ప్రవేశిస్తాయి. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తొలగినప్పటికీ, రైల్వేట్రాక్ వద్ద రహదారి ఇరుగ్గా ఉండడంతో వాహనాల రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ అవాంతరాలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే ఇరువైపు పిల్లర్ల నిర్మాణం పూర్తయింది.

బ్రిడ్జి పూర్తయితే రయ్.. రయ్

ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఆ దారిలో వాహనాలు రయ్‌మని ముందుకు సాగిపోనున్నాయి. ఎన్‌ఏడీ సెంటర్ నుంచి గాజువాక వైపు వెళ్లే దారిలో ఫ్లై ఓవర్ దాటిన వెంటనే రైల్వే ట్రాక్ ఉన్నందున ప్రస్తుతం ఇక్కడ రహదారి ఇరుగ్గా ఉంది. ఫ్లై ఓవర్ కింద నుంచి అటుగా వెళ్లే వాహనాలు ఒకేసారి ఎగువకు ఎక్కాల్సి ఉన్నందున ముందువచ్చే వాహనాలు కనిపించక తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందుకే ఆర్‌వోబీ నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అటువైపు గాజువాక, విమానాశ్రయం నుంచి ఇటు వైపు ఆర్టీసీ బస్టాండ్, మరో వైపున పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్‌లో వెళ్లే వాహనాలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయి



ఫ్లై ఓవర్ దాటాక రైల్వే ట్రాక్ వద్ద రహదారి ఇరుగ్గా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోల ప్రయాణం అటువైపు మరింత ఇబ్బందికరంగా ఉంది. హైవేపై భారీ వాహనాలు వస్తుంటాయి. ఆర్‌వోబీ పూర్తి అయితే ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద ప్రమాదాలు లేకుండా వాహనాల ప్రయాణం సాగుతుంది.

– వాసు, ఆటో డ్రైవర్,ఎన్‌ఏడీ

ఆర్‌వోబీ నిర్మాణం అవసరం



ఎన్‌ఏడీ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టం శుభపరిణామం. ఆర్‌వోబీ నిర్మాణం కోసం ఎన్‌ఏడీ ప్రాంతంలో ఉన్న మేమంతా ఎప్పటి నుంచో అధికారులు, నాటి పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ అప్పట్లో దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజావసరాల మేరకు పనులు చేపడుతుంది.

– టీ.ఎస్.కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్

పూర్తి చేస్తే మేలు



రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం హర్షణీయం.ఎన్‌ఏడీ పరిసర కాలనీల నుంచి గాజువాక వైపు ఉన్న పరిశ్రమలకు విధుల నిమిత్తం ప్రతీ రోజూ రాకపోకలు సాగిస్తుంటాం. ఫ్లై ఓవర్ దాటాక రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆర్‌వోబీ నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తే వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుంది. అధికారులు తగిన చొరవ తీసుకోవాలి.

– విళ్లా సత్యనారాయణ రావు, ఏపీఎస్ఈబీ కాలనీ

మహిళలకు ఆర్థిక ప్రోత్సాహం


మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: రాష్ట్రంలో ప్రతి మహిళకు ఆర్థిక తోడ్పాటు అందించి ముందుకు తీసుకువెళ్లడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. వార్డు పరిధిలోని ఏకేసీకాలనీలో ఆదివారం డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను వినియోగించుకుని, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. గ్రూపు సభ్యులు ప్రభుత్వ సహకారంతో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సీఎం జగన్ నాలుగో దఫా డ్వాక్రా రుణమాఫీ అమలు చేసిన గొప్ప నాయకుడు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసే విధంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీవో శివ, ఆర్పీలు సంతు, ఈశ్వరీ, ఉమా, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

వారాది సేవలు చిరస్మరణీయం


నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు

సింథియా: మానవతావాది స్వర్గీయ వారాది నారాయణరావు సేవలు చిరస్మరణీయమని 40,62వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు కొనియాడారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ గ్రామంలో ఆదివారం జరిగిన వారాది నారాయణరావు సంస్మరణ సభలో పాల్గొన్నారు. వారాది చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వారాది నారాయణరావు చేసిన సేవలు ఎనలేనివని అన్నారు.

ఉత్సాహంగా జైభీమ్ క్రికెట్ కప్ పోటీలు


జై భీమ్ వన్డే క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల దళిత సంఘాల నాయకులు రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం నిర్వహించిన జై భీమ్ వన్డే క్రికెట్ కప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జై భీమ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడాల ఈశ్వరరావు, కార్యదర్శి అనపర్తి సైదాసుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ముప్పిడి గిరి, దళిత నాయకులు రావాడ అప్పారావు, దుబాయ్ రవి, కొట్నాన రవి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉత్సాహంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని 14 దళిత సంఘాలు ఏకతాటిపైకి వచ్చి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీకి చెందిన షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం విన్నర్‌గా.. ఇదే వార్డు రామ్ రంజీ సంక్షేమ సంఘం జట్టు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సభ్యులు తంతటి సంపత్, కాకర నరసింహరాజు, మర్రి సాయివికాస్, యమ్మల సురేష్, బురాలి రామయ్య, నందికోళ్ల శ్రీధర్, దోమాన షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

మల్కాపురం: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ నాయకుడు రామచంద్రరావు అన్నారు. 61వ వార్డు ఆర్‌కేపురంలో ఆదివారం బీఎస్పీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నేటి నుంచి పోరాటాలు చేస్తామన్నారు. స్థానిక పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణం తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులివ్వాలి

విశాఖ విద్య: ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లలితకుమార్, కోశాధికారి ఎస్. రామకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల వితరణ


బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో పలువురి బాధితులకు ఆదివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన బలిరెడ్డి శివ, ఉప్పిలి కొండయ్య, రంధం రాము కుటుంబాలకు స్థానికుడు ఈవీ రమణ సమకూర్చిన సరకులు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గొంతెన నాగరాజు, బలిజ అప్పలనాయుడు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరాలతో ఐక్యత

మల్కాపురం: భారత రాజ్యాంగ లక్ష్యాలైన ఐక్యత, సమగ్రతను సాధించడానికి జాతీయ సమైక్యత శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి అన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ వరకు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆదివారం వచ్చిన వీరిని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం,సిబ్బంది అభినందించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. అర్చకుడు రఘునాథ్, గిరి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ప్రైవేటీకరణపై కేంద్రం దిగిరాక తప్పదు


1074వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల చేస్తున్న పోరాట శక్తికి ఎదురుండదని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1074వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులతో పాటు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటించడం ప్రభుత్వ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటికైనా కేంద్రం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కార్మికులంతా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి సాదర స్వాగతం


విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. విమానంలో ఆదివారం గన్నవరం నుంచి విశాఖ వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తి రెడ్డి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, పల్లా చినతల్లి, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణ కుమారి, తూర్పు పరిశీలకుడు మొల్లి అప్పారావు, , రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు శ్రీవత్సవ, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, గుణిశెట్టి శ్రీనివాసరావు, ఉరుకూటి అప్పారావు తదితరులు ఉన్నారు.

కరాసా పోలీస్ క్వార్టర్స్‌లో సీపీ పర్యటన

మరమ్మతులు చేపట్టాలని ఆదేశం


కరాసా పోలీస్ క్వార్టర్స్ గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న సీపీపి రవిశంకర్, అధికారులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని కరాసా కొత్త పోలీస్ క్వార్టర్స్‌లో ఆదివారం సీపీ డాక్టర్ రవిశంకర్ పర్యటించారు. ఇక్కడి పోలీస్ గృహ సముదాయాలను సందర్శించారు. ఇళ్ల స్థితిగతులతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిచారు. మూడో అంతస్తులో ఉన్న ఇళ్ల సీలింగ్ పాడైదని వాటిని తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించడంతో పాటు అన్ని భవనాలకు పెయింటింగ్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీసీపీ–2(లా అండ్ ఆర్డర్) ఆనందరెడ్డి, ఏసీపీలు ఆర్మడ్ రిజర్వ్ అధికారులు ఉన్నారు.

వేడుకగా శోభాయాత్ర


శోభాయాత్రలో శ్రీరామభక్తులు


శ్రీరామ శోభ యాత్రలో పాల్గొన్న రామ భక్తులు

విశాఖ విద్య: అయోధ్యలో బాలరాముడి విగ్రహప్రతిష్టను పురస్కరించుకొని ఆదివారం రామభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కొత్తపాలెంలో ప్రారంభమైన ఈ యాత్ర బుచ్చిరాజుపాలెం, ఎన్‌ఏడీ సెంటర్ మీదుగా కంచరపాలెం రామూర్తి పంతుల పేట వరకు సాగింది. రామభక్తులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట కోసం హిందూ జాతి 500 ఏళ్లుగా ఎదురుచూస్తోందని, ఇన్నాళ్లకు అది సాకారమైందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కన్నన్, కాళ్ల అశోక్, చందు, దొడ్డి సతీష్, భీశెట్టి నారాయణరావు, సంతోష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన శ్రీరాముడి భక్తులు ఆదివారం సాయంత్రం జింక్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీరామ శోభ యాత్రను వైభవంగా నిర్వహించారు.ఈ యాత్ర ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో మీదుగా నక్కవానిపాలెం,పాత చెక్‌పోస్టు ఏరియా, కోరమాండల్,లేబర్ జంక్షన్,ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ,గంగానగర్,ములగాడ హౌసింగ్‌కాలనీ మీదుగా తిరిగి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంది. భక్తులు జై శ్రీరామ్..జై శ్రీరామ్ నినాదాలతో యాత్ర సాగించారు. సోమవారం అయోధ్య మందిరం వద్ద బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క భక్తుడు తిలకించాలని కోరారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి జై శ్రీరామ్ అని రాయాలని, సాయంత్రం వేళ ఇంట్లో దీపాలు వెలిగించి రామ భక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

సుందరంగా ఫుట్‌పాత్‌లు


కంచరపాలెం రహదారిలో సుందరంగా ఫుట్‌పాత్


ఎన్‌ఏడీ నుంచి కరాస వైపు ఉన్న ఫుట్‌పాత్‌కు రంగులు వేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పాదచారుల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టి రంగులు వేస్తున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఫుట్‌పాత్‌లతో పాటు బీఆర్‌టీఎస్ రహదారిలో ఇరువైపులా ఉన్న గ్రిల్స్‌కు కూడా రంగులు వేస్తున్నారు. ఎన్‌ఏడీ నుంచి కంచరపాలెం, అదే విధంగా బాజీ జంక్షన్ వైపు వెళ్లే రహదారిలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. బీఆర్‌టీఎస్ రహదారిపై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు.దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్‌ఏడీ నుంచి కరాస వరకు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

అలవోకగా 150 పద్యాల ఆలాపన


డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదివి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదవి వినిపించారు.

సమకాలిన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరథి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెదవీర్రాజు చదవి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.